
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శనివారం 6 ఏప్రిల్ 2024





రంజాన్ వేళలు
ఇఫ్తార్ - శనివారం
సాయంత్రం - 6:36
సహర్ - ఆదివారం
ఉదయం - 4:43

మీ ఓటమికి కృషి చేసిన అభ్యర్థికి ఎలా పనిచేయాలి ?

- స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో నిలదీసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు
- వాడీవేడిగా సాగిన వికారాబాద్ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం



వికారాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి చేరిక వికారాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో కలకలం సృష్టిస్తోంది. శుక్రవారం జిల్లా కేంద్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన వికారాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చేవెళ్ల సిటింగ్ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి కూడా హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రసాద్‌కుమార్‌ను ఓడించేందుకు తీవ్రంగా కృషి చేసిన రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు వచ్చారో ?, పార్టీ అధిష్ఠానం ఆయనను ఎందుకు చేర్చుకున్నదో తమకు తెలియదని.. కాంగ్రెస్‌ను ఓడించేందుకు అహర్నిశలు కష్టపడిన రంజిత్‌రెడ్డి కోసం మేమెలా పనిచేయాలంటూ కొందరు సీనియర్ నాయకులు ప్రశ్నించినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మెతుకు ఆనంద్‌ను గెలిపించేందుకు ఒక్కో ఓటుకు రూ.2 వేలైనా ఇచ్చేందుకు సిద్ధపడ్డా.. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, పార్టీ నాయకులు, కార్యకర్తలు రాత్రింబవళ్లు కష్టపడితేనే ప్రసాద్‌కుమార్ విజయం సాధ్యమైందని, ఒకవేళ ఆ ఎన్నికల్లో ప్రసాద్‌కుమార్ ఓటమి చెంది ఉంటే ఆయనకు రాజకీయ భవిష్యత్తే లేకుండా పోయేదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిసెలక్ష్మణ్ అన్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రసాద్‌కుమార్ ఒకవేళ ఓటమి పాలై ఉంటే ఆయన జీవితమే ఓ ప్రశ్నార్థంగా మారి ఉండేదని, ఎన్నికల సమయంలో ఎదుర్కొన్న ఒత్తిడి కారణంగా ప్రసాద్‌కుమార్ అనారోగ్యానికి గురై రెండు స్టంట్లు కూడా వేసుకోవాల్సి వచ్చిందని, ఇదంతా మీ పుణ్యమేనని ఆయన నిలదీసినట్లు తెలిసింది. భార్యను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న ప్రసాద్‌కుమార్‌ను వికారాబాద్‌లో ఓడించేందుకు ప్రయత్నించిన నాయకుడి కోసం ఎలా పనిచేయాలో చెప్పాలంటూ ప్రశ్నించినట్లు సమాచారం. కాంగ్రెస్ అభ్యర్థిగా అధిష్ఠానం నిర్ణయించినందుకు తాము పార్టీ కోసం పనిచేస్తామని చెప్పినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే, మర్పల్లి మండలం, పట్లూర్‌లో జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి జరిగిన అవమానకర సంఘటనపై ఆ పార్టీ ఎంపీగా ఎందుకు స్పందించలేదని ఓమాజీ జడ్పీటీసీ ప్రశ్నించినట్లు తెలిసింది. పార్టీకి చెందిన మహిళా జడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి చేసిన వారిపై కనీసం పోలీసులు కేసు నమోదు చేయలేదని, ఈ విషయమై ఎప్పుడైనా ప్రశ్నించారా? అని నిలదీసినట్లు సమాచారం. అధికారం కోసం తాము ఎప్పుడూ వెంపర్లాడలేదని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తమను ఆహ్వానించినా ప్రతిపక్షంలో ఉండి పోరాటం చేశామే తప్ప తలొగ్గలేదని ఖరాఖండిగా చెప్పినట్లు తెలిసింది. తాము పార్టీ బాగుండాలని ఉన్నది ఉన్నట్లు మాట్లాడతామని, పార్టీ పెద్దలకు ఇబ్బంది అనుకుంటే తామేమీ చేయలేమని స్పష్టం చేసినట్లు సమాచారం. పార్టీ అధిష్ఠానం చెప్పినట్లు పనిచేసేందుకు కేడర్ సిద్ధం లేదనే విషయం గుర్తించాలని, పార్టీలో ఉండమని అంటే ఉంటాం... లేదంటే తమను సస్పెండ్ చేయండి అంటూ పార్టీ సీనియర్ నాయకుడు ప్రసాద్‌కుమార్‌కు స్పష్టం చేసినట్లు తెలిసింది. మండలాల నాయకులు కూడా ఇదే విషయమై ప్రశ్నల పరంపర కొనసాగించగా, చివరకు ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుని రంజిత్‌రెడ్డిని మాట్లాడాలని కోరగా, పార్టీకి, కేడర్‌కు తన వల్ల ఇబ్బందులు ఎదురుకాకుండా చూస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిసింది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యంతో చివరకు వివాదం సమసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే, ఈసమావేశంలో లేవనెత్తిన అంశాల ప్రభావం ఏ విధంగా ఉండనుందనేది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

సర్వం సిద్ధం!

నేడే తుక్కుగూడలో కాంగ్రెస్ జనజాతర

తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ జెండాలతో నిండిపోయింది. ఎక్కడ చూసినా రాహుల్, రేవంత్‌రెడ్డి, ఖర్గే భారీ కటౌట్లే కనిపిస్తున్నాయి. సభా వేదిక పూర్తిస్థాయిలో నిర్మాణం అయింది. కాంగ్రెస్ పార్టీ నేడు తుక్కుగూడలో నిర్వహించనున్న జనజాతర సభకు ఆ పార్టీ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు సభకు వచ్చే వారికి మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేసేందుకు సిద్ధం చేశారు. అంతే కాకుండా ప్రతి పోలింగ్ బూత్ నుంచి పది నుంచి 20మందికి తగ్గకుండా జనాలను తరలించేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేశారు. మొత్తానికి ఈ సభకు పది లక్షల మంది హాజరు అవుతారని అంచనా వేసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆ మేర ఏర్పాట్లను కూడా పూర్తి చేశారు.

- హాజరుకానున్న అగ్రనేతలు ఖర్గే, రాహుల్‌గాంధీ
- భారీగా తరలి రానున్న జనాలు
- వేయిమంది పోలీసులతో భారీ బందోబస్తు
- తాగునీరు, మజ్జిగ, వైద్య సదుపాయాలు



సభా ప్రాంగణం

రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం/కందుకూరు, ఏప్రిల్ 6 : లోక్‌సభ ఎన్నికల ఎన్నికల శంఖారావం పూరించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. తుక్కుగూడ వేదికగా పార్లమెంట్ ఎన్నికలకు సమరశంఖం పూరించనుంది. నేడు (శనివారం) తుక్కుగూడలో జరగనున్న రాజీవ్‌గాంధీ జనజాతర సభకు ఇప్పటికే ఆ పార్టీ నాయకులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. శనివారం సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ హాజరు కానున్నారు. ఈ సభలోనే లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను కూడా ప్రకటించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఔటర్ రింగ్ రోడ్డుకు చేరువలో 70 ఎకరాల్లో బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సభా వేదికకు సమీపంలోనే 550 ఎకరాలు పార్కింగ్ కోసం వేర్వేరు స్థలాలు ఏర్పాటు చేశారు. ఈ సభకు 10లక్షలకు తగ్గకుండా జనాలను తరలించాలని ఆ పార్టీ నాయకు లక్ష్యంగా పెట్టుకున్నారు. బూత్ స్థాయి నుంచి 10-20 మందికి పైచిలుకు తీసుకు వచ్చేందుకు పార్టీ నేతలు కృషి చేస్తున్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు 2023 సెప్టెంబరు 17న తుక్కుగూడలో ఏఐసీసీ అగ్రనేతలు ఖర్గే, సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. ప్రజల్లో వాటికి మంచి ఆదరణ లభించింది. తుక్కుగూడ ప్రాంతం కాంగ్రెస్‌కు సెంటిమెంట్‌గా మారడంతో మరోసారి ఇక్కడి నుంచే లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టేందుకు రంగం సిద్ధం చేసింది. కనీవిని ఎరగనీ తీరులో జనజాతరను నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తమయ్యారు. ఎండల వల్ల ఇబ్బందులకు కలగకుండా సభకు తరలి వచ్చే జనాలకు తాగునీరు, మజ్జిక ప్యాకెట్లను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. 24 లక్షల వాటర్ బాటిళ్లు, 12 లక్షల మజ్జిగ ప్యాకెట్లు రెడీ చేశారు. 300 మంది వలంటీర్లను ఏర్పాటు చేస్తున్నారు. వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు చల్లగా ఉండేందుకు ఐస్ డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్నారు. ఒక డ్రమ్ము వద్ద ఒక ఇన్‌చార్జిని నియమించారు. రాజీవ్‌గాంధీ పేరుతో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం మొత్తం కాంగ్రెస్ జెండాలు, కటౌట్లతో నిండిపోయింది. పోటాపోటీగా నేతలు భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. అయితే, ఎవరికీ ఇబ్బంది కలగవద్దని తుక్కుగూడ మున్సిపాలిటీ నుంచి సభా ప్రాంగణం వరకు రెండు కిలోమీటర్ల మేర పోలీసులు ఆంక్షలు విధించారు.

భారీ బందోబస్తు..

కాంగ్రెస్ సభకు భారీ సంఖ్యలో జనాలు తరలి వస్తుండటంతో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ముగ్గురు డీసీపీలు, ముగ్గురు అడిషనల్ డీసీపీలు, 12మంది ఏసీపీలు, 31మంది సీఐలు, 56 మంది ఎస్సైలు, 54మంది ఏఎస్సైలు, 226 మంది కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొననున్నారు. అదేవిధంగా మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా 93 మంది మహిళా కానిస్టేబుళ్లు, ఏఆర్, స్పెషల్ బ్రాంచ్, ఇంటలిజెన్స్ సిబ్బంది కూడా బందోబస్తులో పాల్గొంటున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

కాంగ్రెస్ జనజాతర సభ ఏర్పాట్లను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పాటు ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, విష్ణునాథం, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీ రంజిత్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి ఉన్నారు. అలాగే పార్టీ సీనియర్ నేతలు మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, పీసీసీ కార్యదర్శులు జానకిరాం, ఏనుగు జంగారెడ్డి, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి కూడా వారి వెంట ఉన్నారు.



సభా ప్రాంగణంలో ఏర్పాట్లు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం

- మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే పేద ప్రజలు సంతోషంగా ఉన్నారని మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం తుక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించే జనజాతర సభ ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీలో మహిళలకు ఉచిత రవాణా, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ పథకాన్ని అర్హులకు చేరవేస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోడ్ వల్ల కొన్నింటిని అమలు చేయలేకపోతున్నామని, ఎన్నికల తర్వాత అమలు చేయనున్నట్లు తెలిపారు. నేడు జరిగే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, ఏనుగు శ్రావణి, పద్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

385 మంది డుమ్మా!

- టెన్త్ మూల్యాంకనానికి హాజరుకాని ఉపాధ్యాయులు
- విధులకు రాని వారికి షోకాజ్‌లు.. క్రమశిక్షణా చర్యలు



మేడ్చల్ ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం విధులకు కొందరు ఉపాధ్యాయులు డుమ్మా కొట్టారు. ఈ నెల 3న బాలానగర్‌లోని ఎస్ఎస్‌కెకె పాఠశాలలో టెన్త్ మూల్యాంకనం ప్రారంభించారు. జిల్లాకు చెందిన వెయ్యి మంది ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. అందులో 385 మంది గైర్హాజరయ్యారు. ఈనెల10 వరకు ఈప్రక్రియ కొనసాగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. గైర్హాజరైన ఉపాధ్యాయులకు మరో అవకాశం ఇచ్చి అప్పటికీ స్పందించకపోతే షోకాజ్ నోటీసులు అందజేసి చర్యలకు అధికారులు సమాయత్తమౌతున్నారు. వివిధ కారణాలతో ఈ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కొందరు ఉపాధ్యాయులు డీఈఓకు దరఖాస్తు చేసుకోగా ఏఒక్కరికీ మినహాయింపు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. నియామకపత్రాలు అందుకున్న ప్రతి ఉపాధ్యాయుడు విధిగా మూల్యాంకనం విధుల్లో పాల్గొనాలని స్పష్టం చేశారు.

ఉన్నతాధికారులకు నివేదికలు

బాలానగర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన రెండున్నర లక్షల సమాధాన పత్రాలు రాగా మొదటి రోజు 50 వేల సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులు కేటాయిస్తారు. డీఈవో విజయకుమారి పర్యవేక్షణలో సహాయ క్యాంపు అధికారులు మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు 50 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసి ప్రతి రోజు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నారు. అయితే బాలానగర్‌లో 385 మంది విధులకు గైర్హాజరుకావడంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చనిపోయిన ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్

పదో తరగతి మూల్యాంకనానికి గైర్హాజరైన ఉపాధ్యాయులకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కాగా చనిపోయిన ఓ ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు జారీ చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. జవహర్‌నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్‌గావిధులు నిర్వహించే ఎన్.గీత క్యాన్సర్‌తో ఏడాది క్రితంమృతి చెందింది. ఈ విషయాన్ని గుర్తించని విద్యాశాఖ అధికారులు ఆమెకు పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధులు కేటాయించారు. హాజరు కాలేదన్న కారణంతో ఆమెకు కూడా షోకాజ్‌లు జారీ చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో ఈ విషయం తీవ్ర చర్చనీయాంశమైంది.

వివరణ కోరాం: డీఈవో విజయకుమారి

చనిపోయిన ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్‌పై హెచ్‌ఎంను వివరణ కోరాం. పాఠశాల హెచ్ఎం కొత్తగా వచ్చాడని పొరపాటునలిస్టులో ఉపాధ్యాయురాలి పేరు పంపించాడని తెలిపారు. మూల్యాంకనం విధులు కేటాయించినప్పుడు గుర్తించాల్సిందని ఆమె తెలిపారు. రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని హెచ్‌ఎంను కోరినట్లు విజయకుమారి తెలిపారు. మూల్యాంకన విధుల్లో చేరకపోతే కలెక్టర్ ఆదేశాలతో షోకాజ్‌లు జారీ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం. మూల్యాంకనం గడువులోగా పూర్తి చేయాలి.



మారేపల్లి వద్ద సుద్ద తవ్వకాలు

రెచ్చిపోతున్న సుద్ద మాఫియా!

- అనుమతులు ఒక చోట.. తవ్వకాలు మరోచోట
- కవరేజికి వెళ్లిన మీడియా ప్రతినిధిని నిర్బంధించే యత్నం
- పోలీసుల రంగప్రవేశం

తాండూరు, ఏప్రిల్ 5: పెద్దేముల్ మండలం మారేపల్లి సమీపంలో సుద్ద మాఫియా రెచ్చిపోంది. సుద్ధ తవ్వకాలకు గోరంత అనుమతులుండగా, కొండంత తవ్వకాలు చేపడుతున్నారు. అంతేకాకుండా అనుమతులు ఒక చోట తీసుకుని మరోచోట తవ్వకాలు చేపడుతున్నారు. సర్వే నంబర్ 34లో సుద్ద తవ్వకాలను పరిశీలించేందుకు వెళ్లిన ఓ దినపత్రిక విలేకరిని సుద్ద మాఫియా నిర్బంధించే ప్రయత్నం చేసింది ఫొటోలు తీసుకుని తిరిగి వస్తుండగా బయటికి రాకుండా జేసీబీతో గోతి తవ్వి బెదిరించే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని సదరు విలేకరి పెద్దేముల్ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు విలేకరిని బయటకు తీసుకొచ్చారు. ఇటీవల మండలంలో సుద్ద అక్రమార్కులు రెచ్చిపోవడంతో పాటు రింగుగా ఏర్పడి అధికారులను, మీడియాను బెదిరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో పర్యావరణ అనుమతులు తప్పని సరి కావడంతో పాటు సుద్ద తవ్వకాలకు మైనింగ్ శాఖ నిబంధనలు విధించింది. సుద్ద తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో ఒక చోట అనుమతులు పొంది మరొచోట తవ్వకాలు చేపట్టడంతో పాటు రాత్రి, పగలు తేడా లేకుండా సుద్ద మాఫియా రెచ్చిపోతున్నది మారేపల్లి సుద్దకు డిమాండ్ విపరీతంగా ఉండడంతో ఇట్టి సుద్దను కొనుగోలు చేసి విదేశాలకు ఎగుమతులు చేసేందుకు వివిధ కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమంగా సుద్ద తవ్వకాలు చేపడతున్నారు. అక్రమార్జనకు సుద్ద అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతున్నారు.



సుద్ద తవ్వకాల వద్దకు వచ్చిన పోలీసులు

ఫ్రైడే



- జిల్లాలో భానుడి భగభగలు
- పుట్టపహడ్‌లో 42.8 డిగ్రీలు
- జిల్లాలో ఐదు చోట్ల 42 డిగ్రీలకుపైనే నమోదు

వికారాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో శుక్రవారం ఏకంగా ఐదు చోట్ల 42 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అత్యధికంగా పుట్టపహడ్‌లో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కోట్‌పల్లిలో 42.5, మర్పల్లిలో 42.4, మోమిన్‌పేట్‌లో 42.3, యాలాల్‌లో 42.0 డిగ్రీలఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తాండూరులో 41.9, తొరమామిడిలో 41.8, దౌల్తాబాద్‌లో 41.4 , బొంరాస్‌పేట్‌లో 41.4, నవాబ్‌పేట్‌లో 41.4, మన్నేగూడలో 41.1, పెద్దేముల్‌లో 41.0, దావల్‌పూర్‌లో 40.9, కాశీంపూర్‌లో 40.8, ధారూరులో 40.8, కొడంగల్‌లో 40.7, పెద్ద ఉమ్మెంతాల్‌లో40.7, బంట్వారంలో 40.7, రాపోల్‌లో 40.5, వికారాబాద్‌లో 40.4, దుద్యాల్‌లో 39.9, మదన్‌పల్లిలో 39.9, చౌడాపూర్‌లో 39.7, తాండూరుఏఆర్ఎస్‌లో 39.7, మద్గుల్‌చిట్టంపల్లిలో 39.6, దోమలో 39.4, పరిగిలో 39.1 డిగ్రీలు నమోదయ్యాయి.

ఘనంగా అల్వీదా జుమ్మా

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 5 : రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అల్వీదా జుమ్మా ఘనంగా నిర్వహించారు. మేడ్చల్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని పెద్ద మసీదు, హజరత్ జిందా షామధార్ మసీదు, చెక్‌పోస్టు ఏక్‌మినార్ మసీదు, అత్వేల్లిలోని మసీదులకు ముస్లింలు పెద్దఎత్తున తరలి రావటంతో కిక్కిరిసి పోయాయి. మసీదు ప్రాంగణాల్లో ప్రార్థనలు నిర్వహించారు.





బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రసాద్‌కుమార్, ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఏప్రిల్5 : మహనీయుల భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ వారి ఆశయాలను కొనసాగించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని జగ్జీవన్‌రామ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి స్పీకర్, నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఆయా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ. ఎంతో మంది మహనీయులు వారి జీవితాలను త్యాగం చేసి సమాజంలో మార్పు కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. చదువులతో సమాజంలో మంచి గౌరవం దక్కుతుందని ఆ దిశగా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎస్పీ కోటిరెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల, ఎస్సీ కార్పోరేషన్ అధికారి బాబు మోజస్, మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఆయా సంఘాల నాయకులు సుధాకర్‌రెడ్డి, విశ్వనాథం సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, దేవదాసు, మేక చంద్రశేఖర్, రామస్వామి, మంచన్‌పల్లి సురేష్, మహిపాల్, అశోక్, జగదీశ్, తిమ్మని శంకర్, వెంకట్ రత్నం పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ హవా



మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కృష్ణ ముదిరాజ్

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ హవా కొనసాగుతోందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి కండ్లకోయకు చెందిన బీజేపీ నాయకుడు నత్తి కృష్ణ ముదిరాజ్ సుధీర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఎంత ప్రయత్నించినా మాల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం మాత్రం కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను తమ ప్రభుత్వం నెల బెట్టుకుంటుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారం చేపట్టిన వందరోజుల్లోపు నెరవేర్చామన్నారు. సమీప కాలంలో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ఖాళీ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ యాదవ్‌య తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' వాటర్‌గ్రిడ్ పరిశీలన



ఘన్‌పూర్ మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 5: మండలంలోని ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ను ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం సందర్శించారు. హైదరాబాద్ నగరానికి నీరందించే ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా ఆయన మేడ్చల్ మండలంలోని ఘనాపూర్ వాటర్ గ్రిడ్‌ను సందర్శించారు. మేడిగడ్డ, కొండపోచమ్మ జలాషయాల పరిస్థితిని పరిశీలించటానికి వెళ్తున్న సందీప్‌కుమార్ మేడ్చల్ మండలంలోని ప్రధాన వాటర్‌గ్రిడ్ పని తీరును తెలుసుకోవటానికి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వాటర్ గ్రిడ్‌లో నిలువ చేస్తున్న నీటిసామర్థ్యం, ఇతర సాంకేతిక వ్యవహారాల గురించి వాటర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సందీప్ కుమార్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఎస్‌సీ కృపాకర్‌రెడ్డి, సీఈ విజయ్ ప్రకాష్, ఎస్ఈ శ్రీనివాస్ చారి, ఈఈలు రాజయ్య, నర్సింగ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంకల్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడు

పూడూరు, ఏప్రిల్ 5: మండలంలోని కంకల్‌లో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువుకు యువకులు ముందుకకు వచ్చి రక్తదానం చేశారు.

వీరశైవ లింగాయత్-లింగ బలిజ సంఘం

తాండూరు పట్టణ నూతన కార్యవర్గం



కార్యవర్గం ఎన్నిక నిర్వహిస్తున్న జిల్లా అధ్యక్షుడు పటేల్ ఉదయ్ శంకర్

తాండూరురూరల్, ఏప్రిల్ 5: వీరశైవ లింగాయత్-లింగ బలిజ సంఘం తాండూరు పట్టణ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పటేల్ ఉదయ్ శంకర్, గౌరవాధ్యక్షుడు మొలిగి వీరేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ గౌరవాధ్యక్షుడిగా యద్రామి బసనప్ప, అధ్యక్షుడిగా గాజుల వీరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఆర్.శరణబసప్ప, తుప్పుడు శేఖర్, చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పటేల్ విజయకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మల్లికార్జున్, సహకార్యదర్శులుగా అల్లం మల్లికార్జున్, గాజుల కమలాకర్, కాసాల నరేందర్, కోశాధికారిగా విజయ్‌భాస్కర్, న్యాయ సలహాదారులుగా శరత్‌చంద్ర, కార్యవర్గ సభ్యులుగా గాజుల బస్వరాజ్, సిద్రామయ్య, రాచప్ప, పటేల్ రాజేంద్రప్ప, బస్వరాజ్, వీరన్న తదితరులను ఎన్నుకున్నారు. ఓబీసీల కోసం పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



చిన్నశేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామి

చిన్నశేషవాహనంపై వేంకటేశ్వరుడి దర్శనం

కొడంగల్, ఏప్రిల్ 5: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులకు చిన్నశేష వాహనంపై దర్శనమిచ్చారు. బద్రి నారాయణుడి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భక్తులు కొడంగల్ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలి రావడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగింది.

వైభవంగా రథోత్సవం



పాంబండపై రథోత్సవాన్ని లాగుతున్న భక్తులు

కులకచర్ల, ఏప్రిల్ 5: కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శివ నామస్మరణతో మారుమోగింది. పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి జాతరలో భాగంగా గురువారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ యథాస్థానం నుంచి శ్రీరాముల పాదాల వరకూ భక్తులు రథాన్ని లాగారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి కల్యాణోత్సవం, రథోత్సవంలో పాల్గొన్నారు. దేవాలయ కమిటీ చైర్మన్ నర్సమ్మ రాములు, ఏవో సుధాకర్ పర్యవేక్షించారు.

మాట నిలబెట్టుకునే నేత మోదీ

» మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బంట్వారం, ఏప్రిల్ 5: ప్రజలకు మాట ఇస్తే ఆ మాటను నిలబెట్టుకునే ఏకైక నేత నరేంద్ర మోడీ అని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని బొపునారం, తొర్మామిడి, రొంపల్లి, సల్బత్రాపూర్ గ్రామాల్లో శుక్రవారం ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామమందిరాన్ని కట్టిన ఘనత మోదీకే దక్కిందన్నారు. దేశమంతా మరోసారి మోదీ పాలన కోసం ఎదురు చూస్తోందన్నారు. పేదలను ఆదుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఆ రెండు పార్టీలకు స్కాంలు చేయడం తప్ప ప్రజలకు స్కీములు అమలు చేయడం తెలియదని ఎద్దేవా చేశారు. మే 13న జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అత్యధిక మెజార్టీ రావాలని పిలుపునిచ్చారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో వికారాబాద్ జిల్లా అధ్యక్షురాలు మాధవి రెడ్డి, తాండూరు నియోజకవర్గం కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్‌యాదవ్, సీనియర్ నాయకులు విజయరాజు, బూత్ ఇన్‌చార్జిలు సురేష్, భాను, నరసింహులు, కొండా వీరారెడ్డి పాల్గొన్నారు.



కామునిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఇంటింటి ప్రచారంలో విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు

కులకచర్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు పిలుపునిచ్చారు. మండలంలోని పీరంపల్లి, కామునిపల్లి, బొంరెడ్డిపల్లి, రాంనగర్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. చేవెళ్ల బరిలో ఎంపీగా పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి, మండల అధ్యక్షుడు సురేశ్, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు డాక్టర్ మీరారెడ్డి, సాధన, విజయవాణి, రమ, సునీత, గౌతమి, కల్పన, అనురాధ, జితేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు అంజిలయ్య, గుడాల వెంకటయ్య, మల్లేశ్, కృష్ణారెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఆశీర్వాదయాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

» భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 5 : ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్ అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలు కావస్తున్నా రెండు లక్షల రుణమాఫీ చేయలేదని విమర్శించారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం చౌరస్తాలో నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతుబంధు డబ్బులు పూర్తి స్థాయిలో రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ మాట్లాడుతూ ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాష, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఎన్ను యాదగిరెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు అజంయ్య యాదవ్, నల్లబోలు భోజిరెడ్డి, బీజేపీ నాయకులు బోసుపల్లి ప్రతాప్, పోరెడ్డి నర్సింహారెడ్డి, గోగిరెడ్డి లచ్చిరెడ్డి, పాల్గొన్నారు.



కిసాన్ మోర్చా రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న డా.బూర నర్సపయ్యగౌడ్

ఎస్సీ నిరుద్యోగులకు ఉచితంగా గ్రూప్ కోచింగ్

వికారాబాద్, ఏప్రిల్ 5: గ్రూప్స్ ఉద్యోగాలకు స్పెషల్ ఫౌండేషన్ కోర్సును జిల్లా ఎస్సీ, నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎస్. మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న వివిధ ఉద్యోగాల నియామక ప్రక్రియల్లో భాగంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన 100మంది ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. కోచింగ్ ను నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కోచింగ్ సమయంలో వారికి హాస్టల్ వసతి, భోజన సదుపాయంతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7013200133 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.



మల్కాపూర్ గ్రామంలో హోమంలో కూర్చున్న దంపతులు

ఘనంగా ద్వితీయ పుష్కర కుంభాభిషేకం

చేవెళ్ల, ఏప్రిల్ 5 : చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భువనేశ్వరీ సహిత పంచలింగేశ్వర, నవగ్రహ, పంచముఖి ఆంజనేయ స్వామి వార్ల దేవాలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. దేవాలయంలో దంపతులు పెద్ద సంఖ్యలో హోమంలో కూర్చుని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేకపూజలు చేశారు. దీంతో దేవాలయం శివనామస్మరణతో మారుమోగింది. ఈ ద్వితీయ పుష్కర కుంభాభిషేకం నేటి వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వార్ల తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

» ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

చేవెళ్ల, ఏప్రిల్ 5 : మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీక అని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. శుక్రవారం చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ వెంకట్ పాల్గొని మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అన్ని పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, ఎంపీ రంజిత్‌రెడ్డి కుమారుడు ఆర్యన్ రాజేశ్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మధుసూదన్‌గుప్తా, భీమయ్య, మైనార్టీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



చేవెళ్లలో ఎమ్మెల్సీని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

వడదెబ్బకు వృద్ధురాలి మృతి

కులకచర్ల, ఏప్రిల్ 5: వడదెబ్బకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. వికారాబాద్ జిల్లా, పరిగి నియోజవర్గంలోని చౌడాపూర్ మండలం, వీరాపూర్ గ్రామానికి చెందిన రెబ్బనమోని వెంకటమ్మ (70) బుధవారం చౌడాపూర్ సంతకు వెళ్లింది. అక్కడ ఎండ వేడిమిని తట్టుకోలేక స్పృహతప్పి కిందపడింది. దీంతో గమనించిన స్థానికులు పాలమూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఆమె వడదెబ్బకు గురైందని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యశీలారెడ్డి తెలిపారు.



ఆర్షియబానుకు ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న పురుషోత్తంరెడ్డి

విద్యావంతులను తయారు చేయడమే లక్ష్యం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 5 : సమాజానికి మంచి విద్యావంతులను తయారు చేయడమే తమ లక్ష్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని ఆ యూనివర్సిటీకి చెందిన ఆర్షియబాను అనే విద్యార్థిని రసాయనశాస్త్రంలో 'డిజైన్ సింథసిస్ అండ్ యాంటీ - క్యాన్సర్ ఎవాల్యూయేషన్ ఆఫ్ సమ్ నావల్ హెటిరో సైక్లిక్ కాంపౌండ్స్' అనే అంశంపై డాక్టర్ జే. భాస్కర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేసింది. శుక్రవారం పురుషోత్తంరెడ్డి ఆమెను అభినందించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పరిశోధనలు చేసే విద్యార్థులకు తమ యూనివర్సిటీ చక్కటి వేదికని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి, ప్రొఫెసర్లు గుర్రపు దామోదర్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, కవిత, రీసర్చ్ డీన్ ఆచార్య క్రిష్టోఫర్, డీన్ సైన్స్ సుందర్‌రాం, వివిధ డిపార్ట్‌మెంట్‌ల హెచ్‌వోడీలు, పీఆర్‌ఓ గాదె రాంబాబు ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సంకేపల్లిగూడ, శేరిగూడ గ్రామస్థులు

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

షాబాద్, ఏప్రిల్ 5 : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేయాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య ఆధ్వర్యంలో సంకేపల్లిగూడ, శేరిగూడ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని అన్నారు. ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, అంజయ్య, అంజిరెడ్డి, వెంకటయ్య, సత్యనారాయణ, సత్యం, నర్సింహులు, వెంకటయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడుచుకోవాలి


పరిగిలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


నవాబుపేటలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


మేడ్చల్ టౌన్: బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

పరిగి, ఏప్రిల్ 5: సమాజంలో ప్రతీఒక్కరు మహనీయులు చూపిన ఆడుగుజాడల్లో నడుచుకోవాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా శుక్రవారం పరిగిలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, ఆయా సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ సురేందర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బి.మారుతి కిరణ్, డీసీసీ కార్యదర్శి కె.హన్మంత్ ముదిరాజ్ పాల్గొన్నారు.

తాండూరు: పట్టణంలో బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా దళిత ప్రజాసంఘాలు, సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, కౌన్సిలర్ శోభారాణి, ఎమ్మార్పీఎస్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆశన్న పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషిచేయాలని ఎదులాబాద్ మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ విశ్వనాథం అన్నారు. మండలంలోని ఎదులాబాద్, అవుశాపూర్, అంకుషాపూర్, కాచవానిసింగారం, ప్రతాప్‌సింగారం తదితర గ్రామాల్లో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎదులాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బింగి యుగేందర్, మీసాల నరేష్, నాగరాజు, నర్సింహ, మారయ్య, మల్లేష్, సుధాకర్, శేఖర్, భాను, మహేష్, నర్సింహ పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాల్లో దళితజాతి ముద్దుబిడ్డ భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కులకచర్లలో శుక్రవారం మండల దళిత యువశక్తి యువజన సంఘం అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గుండుమల్ల నర్సింహులు ఆధ్వర్యంలో డాక్టర్ బాబుజగ్జీవన్‌రాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చౌడాపూర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బొలసాని భీమ్ రెడ్డి, మండల, గ్రామ నాయకులు, యువజన సంఘాల నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్యగౌడ్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాబూ జగ్జీవన్‌రాం సంఘం నాయకులు కృష్ణంరాజు, రమేశ్, సాయిలు, రమేశ్‌బాబు, దస్తప్ప, చింటు, రాములు పాల్గొన్నారు.

వికారాబాద్: నవాబుపేట మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య బాబుజగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మోమిన్‌పేట్: అణగారిన ప్రజల హక్కుల నాయకుడు బాబుజగ్జీవన్‌రాం అని యువకులు కొనియాడారు. మోమిన్‌పేట్ తహసీల్దార్ కార్యాలయం, మొరంగపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం బాబుజగ్జీవన్ రాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మేడ్చల్ టౌన్: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు మేడ్చల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటిల్లో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కమిషనర్లు, మున్సిపల్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ భవన్, కిష్టాపూర్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహాలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

మూడుచింతలపల్లి: పేదల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని మూడుచింతలపల్లి మాజీసర్పంచ్ జామురవి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు, ఎంపీటీసీ నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ వెంకట్‌రాం రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మర్పల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా శుక్రవారం ఘట్‌కేసర్‌లోని బైపాస్ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూ మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, రైతుబంధు కమిటీ మాజీ అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, మల్లేష్, ముత్యాలు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

కీసర: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్వర్యంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో భాగంగా మండల పరిధి చీర్యాల్ చౌరస్తాలో గల బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.


తాండూరు: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో దళిత ప్రజాసంఘాలు, సీపీఐ, సీపీఎం నాయకులు


పరిగి: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లో బాబు జగ్జీవన్ రామ్‌విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు


కులకచర్ల: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు


కొడంగల్:బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ


మర్పల్లి: బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు


ఘట్‌కేసర్: బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆయా పార్టీల, దళిత సంఘాల నాయకులు

అసంపూర్తిగా భోజనశాల నిర్మాణం


జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా భోజనశాల

బషీరాబాద్, ఏప్రిల్ 5: మండలంలోని గొట్టిగఖుర్దు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చేపట్టిన భోజనశాల భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. మనఊరు-మనబడి కింద ఏడాది కిందట ఈ భోజనశాల భవనం మంజూరు కాగా పిల్లర్లు వేసి, పైకప్పు రేకులు బిగించారు. అనంతరం ఐదారు నెలలుగా ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. దీంతో చేసిన పనికి బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు పూర్తి చేయలేకపోతున్నానని కాంట్రాక్టర్ వాపోయాడు. ఈ విషయమై సంబంధిత ఏఈ లక్ష్మణ్‌ను వివరణ కోరగా నిధుల కొరతతో బిల్లులు అందలేదనే విషయం వాస్తవమేనన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వచ్చే విద్యాసంవత్సరం వరకైనా ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 5: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శుక్రవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి చేరుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహులుగౌడ్, అంజిల్‌రెడ్డి, జయకృష్ణ, నర్సింహులు నాయుడు, మల్లికార్జున్, మాదాపూర్ మల్లికార్జున్, దేశ్యానాయక్, కుమ్మరి కృష్ణ, మొగులయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనజాతర సభను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 5: తుక్కుగూడలో శనివారం జరిగే జనజాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో జనజతర సభలో ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అగ్ర నాయకులు, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. ప్రతీ గ్రామం నుంచి ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సంతోష్‌గౌడ్

సొంతగూటికి సంతోష్‌గౌడ్

తాండూరు: బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసిన సంతోష్‌గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పించుకొని కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా సంతోష్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఆలయం, దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే

తాండూరు రూరల్: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆలయం, దర్గాను సందర్శించారు. శుక్రవారం తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం మండలంలోని చంద్రవంచలోని షైబుసుబాని దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బీజేవైఎం ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్‌గా రఘునాథ్‌రెడ్డి

మోమిన్‌పేట్, ఏప్రిల్ 5: మండల కేంద్రానికి చెందిన లకంగారి రఘునాథ్ రెడ్డిని బీజేవైఎం ఆర్‌టీఐ వికారాబాద్ జిల్లా కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా రఘునాథ్‌రెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తనను కన్వీనర్‌గా నియమించడం పట్ల వికారాబాద్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించడంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. శనివారం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. చంద్రాయన్‌పల్లి, రావులపల్లి, అమ్రాది కలాన్, కోల్కుంద తదితర గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప ర్యటించనున్నట్లు తెలిపారు.


రఘునాథ్‌రెడ్డి

ఆకతాయిల ఆటలు కట్టించడానికి షీటీమ్‌కు ఫోన్ చేయండి

యాలాల, ఏప్రిల్ 5: ఆకతాయిల ఆటలు కట్టించాలంటే బాలికలు 181, 100నంబర్లకు ఫోన్‌చేయాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సూచించారు. తాండూరు హైదరాబాద్ రోడ్ మార్గంలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో శుక్రవారం షీటీం ప్రోగ్రాం నిర్వహించారు. పోలీస్ కళాజాత బృందంతో ఆటపాటలతో విద్యార్థుల్లో చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో సీఐ అశోక్, ఇన్‌చార్జి శేఖర్, మమత, పోలీస్ కళాజాత బృందం ఇన్‌చార్జి అశోక్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

సంక్షిప్తంగా..

● **కులకచర్ల:** అనంతసాగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ఆంజనేయులు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పీరంపల్లి రాజు, కృష్ణయ్య గౌడ్, రఘు పాల్గొన్నారు.

● **కొడంగల్:** పేదల తిరుపతిగా పేరొందిన శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 14న బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. శుక్రవారం ఆలయం ఆవరణలో ఎంపీపీ ముద్దప్పదేశ్ ముఖ్ అధ్యక్షతన ఆలయ ధర్మకర్తలు, నందారం కుటుంబసభ్యులు, రైతులు సమావేశమయ్యారు. బండలాగుడు పోటీల నిర్వహణపై వారు చర్చించారు.

● **మోమిన్‌పేట్:** మండలంలో శనివారం బీజేపీ ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **మర్పల్లి:** బూచన్‌పల్లి గ్రామంలో వారం రోజులుగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వీధినాటకం నిర్వహించారు. వారం రోజుల పాటు కొనసాగిన ఈ నాటకాన్ని వివిధ గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి వీక్షించారు.

● **కులకచర్ల:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శిస్తున్న వీధి నాటకాలు చరిత్రను గుర్తుచేస్తాయని బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్ బూనెటి అన్నారు. కులకచర్లలో ప్రదర్శిస్తున్న పోతూలూరి వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటకాన్ని ఆయన గురువారం రాత్రి వీక్షించారు. వీధి నాటకానికి విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదే మహిపాల్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు చంద్రలింగం పాల్గొన్నారు.

వైభవంగా బక్కప్పస్వామి జాతర

మర్పల్లి, ఏప్రిల్ 5: బూచన్‌పల్లి గ్రామంలో బక్కప్ప జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి గురువారం రాత్రి బక్కప్పస్వామి ఆలయం వరకు రథంలో బక్కప్పస్వామిని ఊరేగిస్తూ భజనలు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున రథోత్సవంలో భాగంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బక్కప్పస్వామి దర్శనానికి బూచన్‌పల్లి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.


బక్కప్ప స్వామి రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

సీఎంను కలిసిన రాయిలాపూర్ కాంగ్రెస్ నేతలు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 5: మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. నగరంలోని సీఎం నివాసానికి రాయిలాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు బండ నాగార్జున ఆధ్వర్యంలో పలువురు నాయకులు సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.


సీఎంతో రాయిలాపూర్ గ్రామ నాయకులు

చలివేంద్రం ప్రారంభం

యాలాల, ఏప్రిల్ 5: మండల కేంద్రంలో చావిడి దగ్గర కీర్తిశేషులు, మాజీ సర్పంచ్ పేరి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు రాజేందర్‌రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కోఆప్షన్ సభ్యులు అక్బర్‌బాబా, రాపోలు నాగయ్య, శ్రీనివాస్ (చిన్నా) గొల్ల చందు, యు.శేఖర్, మైనోద్దీన్, సుధాకర్‌గుప్తా, లాలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

● బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ
● కాపలా కుక్కనూ వదలని దొంగలు


చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 5: పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. బంగారు, వెండి ఆభరణాలు, నగదుతో పాటు ఇంట్లో కాపాల ఉన్న కుక్కపిల్లను సైతం దొంగలు అపహరించుకెళ్లారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపల్, ఎన్ఎఫ్‌సీనగర్ సమీపంలోని బాలాజీ నగర్‌లో నివాసముంటున్న పసుపుల అయిలయ్య గురువారం రాత్రి ఘట్‌కేసర్‌లోని బంధువుల ఇంటికి పెళ్లికి వెళ్లాడు. తిరిగి శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటిగేటు తాళంతీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం తీసి ఉంది. అందులోని ఏడు గ్రాముల బంగారు ఆభరణాలు, 11తులాల వెండి కాళ్లపట్టీలు, రూ.5వేల నగదును అపహరించారు. అంతేకాదు.. ఇంటి ఆవరణలో కాపలా ఉన్న కుక్కపిల్లను సైతం ఎత్తుకెళ్లారు. దీంతో శుక్రవారం సాయంత్రం అయిలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం


రమేష్(ఫైల్)

బషీరాబాద్, ఏప్రిల్ 5: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఉన్న జెట్టూర్ బ్రిడ్జి కం బ్యారెజ్ సమీపంలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. కర్ణాటక ప్రాంతం సులేపేట్ పోలీసులు ఘటనాస్థలానికి చేరకుని పరిశీలించగా మృతుడు బషీరాబాద్ మండలం అల్లాపూర్ వాసిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అల్లాపూర్ గ్రామానికి చెందిన రుద్రారం రమేష్(30) ఏపీలోని విజయవాడకు బతుకుదెరువు నిమిత్తం వెళ్లి అక్కడే భార్యాపిల్లలతో ఉంటున్నాడు. స్వగ్రామంలో గురువారం ఓ వివాహ వేడుకలో తన స్నేహితులతో కలిసి వెళ్లినట్లు సమాచారం. ఆదే రోజు స్నేహితులతో కలిసి జెట్టూర్ వద్ద గల బ్రిడ్జి కం బ్యారెజ్ వద్దకు సరదాగా వెళ్లారు. అక్కడా స్నేహితులందరూ కలిసి విందు చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయం వెంట వెళ్లిన స్నేహితులు ఎవరూ బయట పొక్కనీయకుండా చూసినట్లు స్థానికంగా గుసగుసలు వినిపించాయి. రాత్రి అయినా రమేష్ ఇంటికి రాకపోవడంతో తల్లి ఆందోళనకు గురైంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం జెట్టూర్ బ్యారెజ్ వద్ద రమేష్ మృతదేహం స్థానికులకు కనిపించింది. అక్కడి పోలీసులు ఘటనాస్థలం వద్దకు వెంటనే చేరుకున్నారు. మృతుడు రమేష్ ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీట మునిగాడా? లేదా ఏదైనా జరిగిందా? అనే కోణంలో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం విజయవాడలో ఉంటున్న మృతుడి భార్య, కుటుంబసభ్యులకు సమాచారం అందించగా అల్లాపూర్ గ్రామానికి బయల్దేరినట్లు తెలిసింది. కర్ణాటక ప్రాంత సులేపేట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివాజీ విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన శివాజీ విగ్రహం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 5: పట్టణంలోని కసబ్ గల్లీలో ఆరెకటిక సంఘం వారు ఏర్పాటు చేసిన శివాజీ మహరాజ్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈమేరకు సంఘం సభ్యులు శుక్రవారం మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని గాంధీ విగ్రహం సమీపంలోని కసబ్‌గల్లీలో రవి అనే యువకుడి దుకాణం ఎదుట గత ఫిబ్రవరి 9న ఆరెకటిక సంఘం వారు శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కాగా గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీంతో సంఘం సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టామని సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


పరిగిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పరిగి, ఏప్రిల్ 5: డీసీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పరిగిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ధాన్యం కొనుకోలు కేంద్రాన్ని జిల్లా మేనేజర్ శ్యాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ పరిగి బ్రాంచ్ మేనేజర్ డి.వెంకటయ్య, ఏఈవో మహిపాల్, సెంటర్ ఇన్‌చార్జి వెంకటేశ్, సిబ్బంది సంతోష్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 5: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు స్థానిక మసీదులో ముస్లింలతో కలిసి ఉపవాస దీక్షను విరమించారు. అనంతరం ముస్లింలకు భోజనాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మాజీసర్పంచ్ మద్దు శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు అమరం హేమంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, బేరి బాల్‌రాజ్, బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, కుంచ శ్రీనివాస్‌గౌడ్, ఏ.ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

కులకచర్ల, ఏప్రిల్ 5: ఎండవేడిమి నుంచి ఉపశమనం కలిగించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉపయోగించాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన వారికి శుక్రవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో కూలీల దగ్గరికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు స్వరూప, పద్మ, యాదమ్మ, సత్యమ్మ పాల్గొన్నారు.